సాక్షి ప్రకాశం
బుధవారం। 8। అక్టోబర్। 2025



సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌పై ఉక్కుపాదం

సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగంపై ఉక్కు పాదం మోపాలని రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి చైర్మన్ కృష్ణయ్య అన్నారు. - 8లో..



అరటి రైతుల ఆర్తనాదం

ఒక వైపు వర్షాలు, మరో వైపు గిట్టుబాటు ధరలు లేకపోవడంతో అరటి రైతులు ఆందోళన చెందుతున్నారు. - 8లో..

గరిష్టం/కనిష్టం
33 /24

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. చల్లని గాలులు వీస్తాయి. అక్కడక్కడా వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

పాలుట్లకు రవాణా సౌకర్యం కల్పించండి

- ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్

యర్రగొండపాలెం: నల్లమల అటవీ ప్రాంతంలో ఉన్న పాలుట్ల గిరిజన గూడెంకు రవాణా సౌకర్యంలేక ఆ ప్రాంతం గిరిజనులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, మండలంలోని గాంధీనగర్ నుంచి పాలుట్లకు రోడ్డు ఏర్పాటు చేసి వారిని ఆదుకోవాలని ఎమ్మెల్యే, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి తాటిపర్తి చంద్రశేఖర్ కోరారు. ఈ మేరకు మంగళవారం డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, ఓఎస్డీ కె.వెంకటకృష్ణకు అర్జీ అందజేశారు. పాలుట్లలో 200కు పైబడి కుటుంబాలు నివశిస్తున్నాయని, వారందరూ వ్యవసాయంపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారని, వారు పండించిన పంటలకు రవాణా సౌకర్యంలేక సకాలంలో తమ పంటలను మార్కెటింగ్ చేసుకోలేక పోతున్నారని ఆ అర్జీలో పేర్కొన్నారు. అంతేకాకుండా మండల కేంద్రమైన యర్రగొండపాలెంకు నిత్యం విద్యార్థులు, రైతులు, ప్రజలు రాకపోకలు సాగిస్తుండాలని, వైద్యం కోసం దాదాపు 40 కిలో మీటర్లు రావల్సి ఉంటుందని, రోడ్డు సౌకర్యంలేక గర్భిణులు, దీర్ఘ వ్యాధిగ్రస్తులు మెరుగైన వైద్యానికి దూరంగా ఉండాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆయన తెలిపారు. గత 20 సంవత్సరాలుగా రోడ్డు సౌకర్యం కల్పించాలని గిరిజన గూడెం వాసులు కోరుతున్నా ఫారెస్ట్ క్లియరెన్స్ చేయలేక పోయారని, వెంటనే డిప్యూటీ సీఎం స్పందించి పాలుట్ల గిరిజన గూడెంకు వెళ్లేందుకు రోడ్డు సౌకర్యం కల్పించాలని, అందుకు ఫారెస్ట్ క్లియరెన్స్ అందేలా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఎమ్మెల్యే వెంట మండల పార్టీ కన్వీనర్ ఏకుల ముసలారెడ్డి, పుల్లలచెరువు మండల మాజీ ఎంపీపీ మార్తాల సుబ్బారెడ్డి, సర్పంచ్‌లు టి.సత్యనారాయణరెడ్డి, ఎ.వీరవెంకట కోటిరెడ్డి, ఆవుల రమణారెడ్డి, సురేష్ నాయక్ ఉన్నారు.

నీలకంఠేశ్వర స్వామికి సూర్య కిరణాభిషేకం

తాళ్లూరు: మండలంలోని మాధవరం గ్రామంలో ప్రసిద్ధ గాంచిన గంగా పార్వతి సమేత నీలకంఠేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం పౌర్ణమి కావడంతో సూర్యకిరణాలు గర్భగుడి నుంచి నేరుగా స్వామి వారి మూలమూర్తిని తాకాయి. ఏటా కార్తీక మాసానికి ముందు వచ్చే పౌర్ణమి, మళ్లీ కార్తీక పౌర్ణమి రోజున, శివరాత్రి రోజున ఇలా జరుగుతుందని ఆలయ పూజారి తెలిపారు. ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని భక్తిశ్రద్ధలతోలతో పూజలు నిర్వహించారు.



స్వామి వారి పై సూర్యకిరణాలు పడుతున్న దృశ్యం

పల్లెల్లో పులి పంజా

దట్టమైన అడవుల్లో సంచరించే పెద్దపులులు, చిరుతలు జనావాసాల్లోకి వచ్చేస్తున్నాయి. ఆహారం, నీటి కోసం అటవీ సమీప గ్రామాల్లో, కొండ కింద శివారు గ్రామాల్లో వన్యప్రాణుల సంచారం అధికమైంది. నల్లమల అటవీ ప్రాంతంతో పాటు, వెలిగొండ రిజర్వ్ ఫారెస్టు సమీప గ్రామాల్లో చిరుతలు, పెద్దపులులు తరచూ స్థానికుల కంటపడుతున్నాయి. దీంతో ఆయా గ్రామాల ప్రజలు వణికిపోతున్నారు. పొలాల్లో పనులకు వెళ్లేందుకు రైతులు, పశువులను మేపేందుకు అడవిలోకి వెళ్లేందుకు పశుపోషకులు జంకుతున్నారు.

- కొండకింద, అటవీ సమీప గ్రామాల్లో పెద్దపులులు, చిరుతల అలజడి
- నీరు, ఆహారం కోసం గ్రామాల్లోకి వన్య ప్రాణులు
- పులులను ప్రత్యక్షంగా చూడటంతో వణుకుతున్న రైతులు
- పొలాలకు సైతం వెళ్లేందుకు వెనకాడుతున్న అన్నదాతలు
- వెలిగొండ రిజర్వ్ ఫారెస్ట్ పరిధిలోని గ్రామాల్లో ట్రాప్ కెమెరాల ఏర్పాటు
- కనిగిరి ఫారెస్ట్ పరిధిలో 15 నుంచి 20 వరకు చిరుతలు



1. నల్లమలలో సంచరిస్తున్న పెద్ద పులి (ఫైల్)
2. భైరవకోన రిజర్వ్‌ఫారెస్ట్ ట్రాప్ కెమెరాలో చిక్కిన చిరుత
3. పులి కనిపించిన ప్రాంతంలో పులి పాదముద్రలు

కనిగిరిరూరల్/పెద్దదోర్నాల: నల్లమలలో కొన్ని రోజులుగా వన్యప్రాణుల సంఖ్య విపరీతంగా పెరిగింది. ఇటీవల జరిగిన పులుల గణనలో పులుల సంతతి పెరిగిన విషయం తేలింది. ప్రస్తుతం నల్లమల అభయారణ్యంలో 85 వరకు పెద్దపులులు, లెక్కకు మించిన చిరుత పులులు ఉన్నట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. వర్షాకాలం ఆరంభమైన నాటి నుంచి భారీ స్థాయిలో వర్షాలు కురవకపోవటంతో నల్లమలలో కొంత మేర నీటికి ఇబ్బందులతో పాటు పులుల ఆహార సమస్యలను తీర్చే సాంబార్, కణుతుల వంటి భారీ వన్యప్రాణుల సంచారం లేకపోవటంతో పులులకు ఆహార కొరత ఏర్పడింది. నీరు, ఆహారాన్ని వెతుక్కుంటూ పులులు అటవీ సమీప గ్రామాలకు వస్తుండటంతో స్థానికుల కంటపడుతున్నాయి. కొన్నిసార్లు పశువులపై దాడి చేస్తున్నాయి.

కనిగిరి ఫారెస్ట్ రేంజ్ పరిధిలో సుమారు 48,500 హెక్టార్లలో అటవీ ప్రాంతం విస్తరించి ఉంది. 7 సెక్షన్లు, 16 బీట్‌లు ఉన్నాయి. ప్రధానంగా భైరవకోన, వెలిగొండ రిజర్వ్ ఫారెస్ట్ పరిధిలోని ప్రాంతాల్లో సుమారు 15 నుంచి 20 వరకు చిరుత పులులు సంచరిస్తున్నట్లు అధికారులు తెలిపారు. కనిగిరి ఫారెస్ట్ రేంజ్ పరిధిలోని వెలిగొండ రిజర్వ్ ఫారెస్ట్‌లోని నాగిరెడ్డిపల్లి, వెదుళ్లచెరువు, గుడిపాటిపల్లి బీట్‌ల పరిధిలోని కొండ కింద శివారు గ్రామాల్లో చిరుత పులి సంచరిస్తోంది. వారం రోజుల క్రితం మరపగుంట్లలో పులి సంచరిస్తున్నట్లు ప్రచారం జరిగింది. ఫారెస్ట్ అధికారులు ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. పాదముద్రలు సేకరించి 3, 4 ఇంచుల పొడవు ఉన్నట్లు తెలిపారు. పాద ముద్రలను బట్టి అది పెద్దపులి కాదని నిర్ధారించారు. పెద్దపులి పాద ముద్రలు 7, 8 ఇంచుల పొడవు ఉంటాయన్నారు. అక్కడ ఉన్న పాదముద్రల నమూనాలను బట్టి చిరుత పులి, లేదా జంగు పిల్లి అయి ఉంటుందని ఫారెస్ట్ అధికారులు వెల్లడించారు. తాజాగా గత శనివారం రాత్రి ఇమ్మడి చెరువు, రాళ్లపల్లి మధ్య ప్రాంత పొలాల్లో, గ్రామ శివార్లలో బైక్‌పై వెళ్తున్న ఒకరు పులిని చూసినట్లు చెప్పాడు. దీంతో ఆదివారం ఫారెస్ట్ అధికారులు ఆయా ప్రాంతాల్లో పర్యటించి పాదముద్రల నమూనాలను సేకరించారు. ఆ ప్రాంతంలో ట్రాప్ కెమెరాలను ఏర్పాటు చేశారు. ఇటీవల తుంగోడు, చెన్నపునాయునిపల్లి, మైలుచర్ల బొంతవారిపల్లి, పిల్లిపల్లి బీట్‌లలో ఏర్పాటు చేసిన ట్రాప్ కెమెరాల్లో వన్య ప్రాణులతో పాటు చిరుత పులులు కనిపించినట్లు ఫారెస్ట్ అధికారులు వెల్లడించారు.



ఇమ్మడి చెరువు, మరపగుంట్ల పొలాల్లో పాదముద్రల నమూనాలను సేకరిస్తున్న ఫారెస్ట్ అధికారులు



పులులు సంచరించిన ప్రాంతంలో పాదముద్రలు సేకరిస్తున్న అటవీశాఖ సిబ్బంది

యర్రగొండపాలెం రేంజ్ పరిధిలోనూ..

యర్రగొండపాలెం రేంజి పరిధిలోని కొలుకుల బీట్‌లో పెద్దపులి కనబడటంతో రైతులు భయంలో వణికిపోతున్నారు. గత ఆదివారం వ్యవసాయ పనులకు వెళ్తున్న రైతులకు పెద్దపులి కనిపించింది. దీంతో పొలాలకు వెళ్తున్న రైతులతో పాటు రైతు కూలీలు సైతం భయాందోళనతో వణికిపోతున్నారు. కొలుకుల బీటులోని అటవీ ప్రాంతంలో పెద్దదోర్నాల మండల పరిధిలోని పెద్దబొమ్మలాపురం రైతులకు చెందిన వ్యవసాయ భూములు ఎక్కువగా ఉండటంతో తరచూ వన్యప్రాణులతో సమస్యలు ఎదురవుతున్నాయి. పెద్దపులి సంచారం ఉన్న దేవలూడు ప్రాంతంలో గతంలోనే అటవీశాఖ బేస్ క్యాంపును ఏర్పాటు చేసింది. పులులకు ఆహారం దొరక్క పశువుల మందలు ఉన్న పెద్దదోర్నాల మండలం గండిచెరువు సమీప ప్రాంతాల్లో పెద్దపులుల సంచారం ఎక్కువగా ఉందని పశువుల కాపరులు పేర్కొంటున్నారు. దీనికి తోడు దేవలూడు ప్రాంతంలో నీటి నిల్వలు అధికంగా ఉండటం కూడా పులుల సంచారానికి మరో కారణమని పలువురు పేర్కొంటున్నారు. గతంలో పాలుట్లలో తన పొలానికి వెళ్లి తిరిగి వస్తున్న రైతు బాలునాయక్‌పై పెద్దపులి దాడి చేసి తీవ్రంగా గాయపర్చగా, బొమ్మలాపురానికి చెందిన ఓ రైతుకు సంబంధించిన ఎద్దును పులిని సైతం పులి హతమార్చింది. గ్రామానికి చెందిన దేవలూడు, గండి చెరువు ప్రాంతాల్లోనే ఎక్కువ శాతం గ్రామస్తుల వ్యవసాయ భూములు ఉండటంతో బొమ్మలాపురం వాసులు ఆందోళన చెందుతున్నారు.

గిద్దలూరు నియోజకవర్గంలోనూ..

అర్ధవీడు మండలంలోని కొత్తూరు, దొనకొండ, వెలగలపాయ, బొల్లుపల్లి, అచ్చంపేట, మాగుటూరు, మోహిద్దీన్‌పురం గ్రామాల పరిధిలో తరచూ పులి సంచరిస్తుండటంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. వెలగలపాయ, దొనకొండ, మాగుటూరు సమీపంలోని అటవీ ప్రాంతాల్లో మేతకు వెళ్లిన పశువులపై పులి దాడి చేసి చంపేసిన ఘటనలు ఉన్నాయి. మొహిద్దీన్‌పురం వద్ద కారులో వెళ్తున్న కొందరికి పులి రోడ్డు దాటుతూ కనిపించిందని స్థానికులు చెబుతున్నారు. కంభం మండలంలోని దర్గా కొండ సమీపంలో నెల రోజుల క్రితం పులి అడుగులు కనిపించడంతో ఫారెస్టు అధికారులు పరిసర ప్రాంతాల్లో గాలింపు చర్యలు చేపట్టారు. మండలంలోని సూరేపల్లి సమీపంలో కొండవద్ద పులి అడుగులు ఉన్నాయని స్థానికులు చెప్పగా ఫారెస్టు అధికారులు ట్రాప్ కెమెరాలు బిగించి పరిశీలించారు. వన్యప్రాణులు జనావాసాల్లోకి రాకుండా అటవీ శాఖాధికారులు పటిష్ట చర్యలు తీసుకోవాలని, అటవీ ప్రాంతాల్లో నీటివనరులు ఏర్పాటు చేయాలని అటవీ సమీప గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

పులి సంచారంపై వివరాలు సేకరించాం

పులి సంచారానికి సంబంధించిన వివరాలను సేకరించాం. ఆ ప్రాంతంలో పులి కాలి గుర్తులు లభించాయి. దేవలూడు అటవీ ప్రాంతం కాబట్టి పులుల సంచారం ఉంది. పెద్దబొమ్మలాపురంలో పులి సంచారంపై ప్రజలకు అవగాహన కార్యక్రమం చేపట్టాం. రైతులు కొద్దిపాటి జాగ్రత్తలు తీసుకోవాలి.

– హరి, ఫారెస్టు రేంజి అధికారి, పెద్దదోర్నాల

ట్రాప్ కెమెరాలను ఏర్పాటు చేస్తున్నాం

కనిగిరి ఫారెస్ట్ రేంజ్ పరిధిలో పెద్ద పులులు లేవు. భైరవకోన, వెలిగొండ రిజర్వ్ ఫారెస్ట్ పరిధిలో సుమారు 15 నుంచి 20 వరకు చిరుత పులులు ఉన్నాయి. వారం రోజుల నుంచి నాగిరెడ్డిపల్లి, వెదుళ్లచెరువు, గుడిపాటిపల్లి బీట్ పరిధిలోని గ్రామాల్లో చిరుత పులి సంచరిస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు. ఆయా ప్రాంతాల్లో కెమెరా ట్రాప్‌లను ఏర్పాటు చేస్తున్నాం. మన ప్రాంతంలో పెద్ద పులులు లేవు. అయినా కొండ కింద గ్రామాల ప్రజలు ఆరుబయట రాత్రి వేళ నిద్రించవద్దు. పొలాలకు వెళ్లే రైతులు, మేతకు అడవుల్లోకి వెళ్లే వారు ఒంటరిగా పోవద్దు. గ్రామ మొదట్లోనే పశువులను మేపుకోండి. నీటి కోసం, ఆహారం కోసం రాత్రిపూట వన్య ప్రాణులు అడవి నుంచి బయటకు వచ్చే అవకాశం ఉంది.

– తుమ్మా ఉమా మహేశ్వరరెడ్డి, ఫారెస్ట్ రేంజ్ అధికారి, కనిగిరి

లక్ష మందితో జగనన్న దళిత ఫోర్స్

- వారం రోజుల్లో గ్రామ స్థాయి కమిటీలు సిద్ధం చేయాలి
- ప్రజా సమస్యలపై జరిగే పోరాటాల్లో ఎస్సీ సెల్ నాయకులు భాగస్వాములు కావాలి
- పార్టీ నాయకులందరినీ సమన్వయం చేసుకొని అంకితభావంతో పనిచేయాలి
- చంద్రబాబు పాలనలో ఏడాదిన్నరలోనే దళితులకు రూ.20 వేల కోట్ల నష్టం
- జగనన్నను ముఖ్యమంత్రిని చేసుకోవడమే దళితుల లక్ష్యం కావాలి
- జిల్లా ఎస్సీ సెల్ సమీక్ష సమావేశంలో ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు టీజేఆర్ సుధాకర్ బాబు



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే, ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు టీజేఆర్ సుధాకర్‌బాబు

ఒంగోలు టౌన్: రాష్ట్రంలోని 16 వేల గ్రామ పంచాయతీలు, 660 మండలాలు, 17 నగర పాలక సంస్థల నుంచి లక్ష మందితో జగనన్న దళిత ఫోర్స్ ఏర్పాటు చేసి మెగా సమావేశాన్ని నిర్వహించడానికి సన్నాహాలు చేస్తున్నట్లు వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు టీజేఆర్ సుధాకర్‌బాబు చెప్పారు. జిల్లా వైఎస్సార్ సీపీ కార్యాలయంలో మంగళవారం ఎస్సీ సెల్ కమిటీ సభ్యులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ సెల్ జిల్లా, నియోజకవర్గ నాయకులకు దిశానిర్దేశం చేశారు. గతంలో ఎన్నడూ లేని విధంగా సంస్థాగతంగా పార్టీని బలోపేతం చేస్తున్నట్లు చెప్పారు. వారం రోజుల్లోపే గ్రామ స్థాయి కమిటీలు వేయడానికి సిద్ధం చేయాలని పిలుపునిచ్చారు. ప్రతి గ్రామం నుంచి క్రియాశీలకంగా వ్యవహరించే ఇద్దరు నాయకుల పేర్లను సూచించాలని కోరారు. అందులోంచి ఒకరిని మండల కమిటీకి ప్రతిపాదిస్తారని, మరొకరిని గ్రామ కమిటీ అధ్యక్షుడిగా నియమిస్తారని వివరించారు. వీరందరితో త్వరలోనే జిల్లా ఎగ్జిక్యూటివ్ సమావేశాన్ని నిర్వహించనున్నట్లు చెప్పారు. ఎంపిక చేసిన కమిటీలతో కేంద్ర కార్యాలయంలో మూడు రోజుల పాటు శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు తెలిపారు. భవిష్యత్తులో ఎస్సీ సెల్ నాయకులకు తగిన ప్రాధాన్యత ఇస్తారని చెప్పారు. పార్టీ అధికారంలోకి వచ్చాక నామినేటెడ్ పదవుల్లో ఎస్సీలకు సరైన ప్రాముఖ్యత ఇవ్వాలని అధిష్టానం నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. పార్టీని అధికారంలోకి తీసుకొచ్చేందుకు అన్నివర్గాల నాయకులను సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగాలని సూచించారు. పార్టీ అధినేత ఆదేశాలను, జిల్లా అధ్యక్షుడి సూచనలు సలహాలను, ఇన్‌చార్జిల సహకారాన్ని తీసుకొని క్షేత్ర స్థాయిలో పనిచేయాలని చెప్పారు. గ్రామస్థాయిలో పార్టీని బలోపేతం చేసేందుకు నిబద్ధతగా పనిచేయాలని, పార్టీకి ఎస్సీ సెల్ ప్రాణవాయువులా పనిచేయాలని కోరారు.

చంద్రబాబు పాలనలో దళితులకు అన్యాయం:

చంద్రబాబు కూటమి పాలనలో రాష్ట్రంలోనే దళితులకు తీరని అన్యాయం జరుగుతుందని సుధాకర్ బాబు ఆరోపించారు. చంద్రబాబు ఏడాదిన్నర పాలనలో ఎస్సీలకు రూ.20 వేల కోట్ల నష్టం జరిగిందని చెప్పారు. సూపర్ సిక్స్ పథకాలతో దళితులకు ఒరిగేదేమీ లేదని స్పష్టం చేశారు. ఉచిత బస్సుల పథకంలో రోజూ ప్రయాణించే మహిళలు ఎవరు, వారి సామాజిక వర్గాలు ఏమిటో చెప్పాలని ప్రశ్నించారు. ఉచిత బస్సుల్లో ప్రయాణించే వారిలో మాల, మాదిగ, రెల్లి, పైడి కులాలకు చెందిన మహిళలు ఎంతమంది ఉన్నారో చెప్పాలని నిలదీశారు. ఉచిత బస్సు పథకంతో దళితులకు జరిగే మేలు ఏమీ లేదని వివరించారు. ఇప్పటికే దళిత బిడ్డలు చదువుకుంటున్నారని కక్ష కట్టి ప్రభుత్వ బడుల్లో ఇంగ్లిషు మీడియం తీసేశారని, అమ్మ ఒడి లేదు, చేయూత లేదని చెప్పారు. రాష్ట్రంలో లక్ష పింఛన్లను తొలగించారని, అందులో 50 వేల పింఛన్లు దళితులకు చెందినవే ఉన్నాయన్నారు. ఉచిత గ్యాస్ పథకం కూడా దళితులకు పూర్తిగా వర్తించదని, గ్యాస్ సిలిండర్లు వాడేవారిలో ఎక్కువగా దళితులు లేరని, కట్టెలు తెచ్చుకొని పొయ్యిలో వంట చేసుకునే వారే అత్యధికంగా ఉన్నారని చెప్పారు. ఆటో డ్రైవర్లలో ఎంత మంది ఎస్సీలు ఉన్నారో లెక్క తేల్చాలని డిమాండ్ చేశారు. జగనన్న పాలనలో వివిధ పథకాల ద్వారా రూ.70 వేల కోట్లను దళితులకు అందజేశారని తెలిపారు. జగనన్న మంజూరు చేసిన 17 మెడికల్ కాలేజీలను ప్రైవేటు వ్యక్తులకు అప్పగించడం దారుణమన్నారు. అవే కనుక ప్రభుత్వ నిర్వహిస్తే అందులో ఉచితంగా వైద్య సేవలను పొందేవారిలో దళితులే ఎక్కువగా ఉంటారని, మెడికల్ కాలేజీల్లో దళిత బిడ్డలు చదువుకునేవారని చెప్పారు. అందుకే కక్షకట్టి మెడికల్ కాలేజీలను ప్రైవేటు పరం చేస్తున్నాడని ఆరోపించారు. అయినప్పటికీ ప్రైవేటు మెడికల్ కాలేజీల జీవో రద్దు చేసేంత వరకు జగనన్న ఊరుకునేది లేదని తేల్చి చెప్పారు. చంద్రబాబును గద్దె దింపడమే దళితుల ఏకైక లక్ష్యమన్నారు. సమావేశంలో ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు జి.దేవ ప్రసాద్, ఒంగోలు నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు కె.దానియేలు, దర్శి నియోజకవర్గ అధ్యక్షుడు జి.యేసుదాసు, కొండపి నియోజకవర్గ అధ్యక్షుడు చుక్కా కిరణ్ కుమార్, మార్కాపురం నియోజకవర్గ అధ్యక్షుడు ఏ.లూక్, ఎస్సీ సెల్ రాష్ట్ర జాయింట్ సెక్రటరీలు దుడ్డు వినోద్ కుమార్, బి.ప్రవీణ్ కుమార్, ఎస్సీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎం.వెంకటేశ్వర్లు, ఎస్సీ సెల్ ఒంగోలు సీటీ అధ్యక్షుడు పి.గోపిచంద్, నాయకులు కె.డేవిడ్, డి.రమణ పాల్గొన్నారు.

సీజేఐపై దాడి యత్నానికి నిరసనగా న్యాయవాదుల రాస్తారోకో



నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

ఒంగోలు: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి బీఆర్ గవాయ్‌పై దాడి యత్నాన్ని ఖండిస్తూ ఒంగోలులో న్యాయవాదులు మంగళవారం విధులను బహిష్కరించడంతోపాటు రాస్తారోకో చేసి నిరసన తెలిపారు. ఒంగోలు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బొడ్డు భాస్కరరావు, ప్రధాన కార్యదర్శి జగ్జీవన్‌రామ్, సంయుక్త కార్యదర్శి గ్రేస్ కుమారిల ఆధ్వర్యంలో జిల్లా కోర్టు ఎదుట రోడ్డుపై ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని, లౌకిక వాదాన్ని, న్యాయ వ్యవస్థ స్వతంత్ర ప్రతిపత్తిని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. దాడికి యత్నించిన న్యాయవాది లైసెన్స్‌ను రద్దుచేయాలని బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియాకు విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. భవిష్యత్తులో ఇటువంటి చర్యలకు మరొకరు పాల్పడకుండా చర్యలు ఉండాలని కోరారు. సీజేపై దాడి యత్నం అనైతిక చర్య అని ఒంగోలు బార్ అసోసియేషన్ సభ్యులు నినదించారు.

వృద్ధులను ప్రేమ, గౌరవంతో చూడాలి

- జిల్లా రెవెన్యూ అధికారి బీసీహెచ్.ఓబులేసు



ప్రపంచ వయో వృద్ధుల దినోత్సవంలో ప్రతిజ్ఞ చేయిస్తున్న డీఆర్ఓ ఓబులేసు

ఒంగోలు సబర్బన్: వయో వృద్ధులు ప్రేమ, గౌరవంతో జీవించగలిగే ఒక సహాయక సమ్మిళిత సమాజాన్ని రూపొందించడానికి మనం కలిసి సంకల్పిద్దామని జిల్లా రెవెన్యూ అధికారి (డీఆర్ఓ) బీసీహెచ్.ఓబులేసు పిలుపునిచ్చారు. ప్రపంచ వయో వృద్ధుల దినోత్సవాన్ని మంగళవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్‌లో ఘనంగా కార్యక్రమం నిర్వహించారు. జిల్లా రెవెన్యూ అధికారి సీహెచ్.ఓబులేసు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో జిల్లాలోని వృద్ధులు సంఘాలు, వృద్ధాశ్రమ నిర్వాహకులు పాల్గొని వృద్ధుల సంక్షేమం, రక్షణ కోసం ప్రతిజ్ఞ చేశారు. విభిన్న ప్రతిభావంతులు, వయో వృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు సీహెచ్.సువార్త మాట్లాడుతూ వృద్ధుల సంక్షేమానికి ప్రభుత్వం రూపొందించిన నిబంధనల ప్రకారం అవసరమైన సహాయాన్ని, చర్యలు అందించడానికి ఎల్లప్పుడూ సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ఈ సందర్భంగా కొందరు వృద్ధులు తమ సమస్యలను తెలియజేయగా, డీఆర్వో వాటిలో కొన్నింటిని వెంటనే పరిష్కరించారు. వృద్ధాశ్రమ నిర్వాహకులు, వృద్ధుల సంఘ ప్రతినిధులు తమ అనుభవాలను పంచుకుని, సమస్యల పరిష్కారం కోసం అభ్యర్థనలు సమర్పించారు. ఈ సందర్భంగా వృద్ధుల సేవలో విశేషంగా సహకరించిన వారిని సన్మానించారు. అవసరమైన వృద్ధులకు చేతి కర్రలు పంపిణీ చేశారు.

వెయిట్ లిఫ్టింగ్ జిల్లా క్రీడాకారుల ఎంపిక



ఎంపికైన బాలురు

ఒంగోలు: వెయిట్ లిఫ్టింగ్ అండర్ 17 జిల్లా క్రీడాకారులు ఎంపిక స్థానిక భారత జాతీయ వ్యాయామ కళాశాలలో మంగళవారం నిర్వహించారు. ఎంపిక ప్రక్రియను ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి చక్కా వెంకటేశ్వర్లు, ఎ.శిరీషకుమారి, బి.భక్తధృవుడు తదితరులు ఎంపిక ప్రక్రియను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎంపికైన క్రీడాకారులు జిల్లా ఖ్యాతిని ఇనుమడింపజేసేలా రాష్ట్ర స్థాయిలో పతకాలు కైవసం చేసుకోవాలని సూచించారు.



ఎంపికైన బాలికలు

క్లుప్తంగా

వాల్మీకి జీవితం ఆదర్శనీయం

● జయంతి కార్యక్రమంలో కలెక్టర్ రాజాబాబు



వాల్మీకి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్ రాజాబాబు, జిల్లా అధికారులు

ఒంగోలు సబర్బన్: మానవాళికి రామాయణం లాంటి మహత్తరమైన కావ్యాన్ని అందించిన మహానుభావుడు మహర్షి వాల్మీకి అని, ఆయన జీవితాన్ని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని కలెక్టర్ పి.రాజాబాబు పేర్కొన్నారు. మంగళవారం వాల్మీకి మహర్షి జయంతి కార్యక్రమాన్ని బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఘనంగా నిర్వహించారు. వాల్మీకి చిత్రపటానికి కలెక్టర్ పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వాల్మీకి రచించిన రామాయణం నేడు యావత్ ప్రపంచానికే ఆదర్శమని కొనియాడారు. మహనీయుల జయంతులు, ఉత్సవాలు నిర్వహించుకోవడమంటే కేవలం వారిని స్మరించుకోవడమే కాదని, వారు అందించిన సేవలను ప్రజలకు తెలియజెప్పాలన్నారు. అన్నదమ్ముల మధ్య సంబంధం ఎలా ఉండాలి, కుటుంబ బాంధవ్యాలు ఎలా ఉండాలి, సమస్యలను ఎలా పరిష్కరించాలి, ఎన్ని కష్టాలు వచ్చినప్పటికీ ధర్మం వైపు నిలిచి ఉండటం ఎలా అనే విషయాలను సమాజానికి తన కావ్యం ద్వారా తెలియజేసిన మహోన్నతుడు వాల్మీకి అని కొనియాడారు. కార్యక్రమంలో బీసీ వెల్ఫేర్ జిల్లా అధికారి నిర్మల జ్యోతి, జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వరరావు, పలు బీసీ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

గేదె కోసం వాగులో దిగి వ్యక్తి మృతి



దేవదాస్ మృతదేహం కోసం వాగులో గాలిస్తున్న కుటుంబసభ్యులు

పొన్నలూరు: గేదె కోసం వాగులో దిగిన వ్యక్తి ప్రమాదవశాత్తు నీటిలో మునిగి మృతి చెందాడు. ఈ సంఘటన పొన్నలూరు మండలం రాజోలుపాడులో మంగళవారం జరిగింది. కుటుంబసభ్యులు, స్థానికుల తెలిపిన వివరాలు మేరకు..గ్రామంలోని ఎస్సీ కాలనీకి చెందిన ఎలికా దేవదాస్(45) రోజు మాదిరిగానే తన గేదెలను కాసుకోవడానికి పొలం వెళ్లాడు. గేదెలు గ్రామ శివారులో ఉన్న నీటి వాగులోకి దిగాయి. వీటిని బయటకు తోలే క్రమంలో దేవదాస్ కూడా వాగులోకి దిగాడు. అయితే వాగు లోతుగా ఉండి ఈత రాకపోవడంతో నీటిలో మునిగిపోయి మృతి చెందాడు. దేవదాస్ వాగులో దిగినట్లు ఆనవాళ్లు ఉండటంతో ఈత రాక మృతి చెందినట్లు బంధువులు నిర్ధారించుకొని మృతదేహం కోసం వాగులో గాలిస్తున్నారు.

ఉరి వేసుకొని యువకుడి మృతి

ఒంగోలు టౌన్: నగరంలోని మంగమూరు డొంకలో ఉన్న ఒక బేకరిలో పని చేసే కార్మికుడు ఉరి వేసుకొని బలవన్మరణానికి పాల్పడ్డాడు. పోలీసుల వివరాల మేరకు.. సీఎస్ పురం మండలం అరివేముల గ్రామానికి చెందిన చల్లగాలి బాబు (19) గత కొంత కాలంగా నగరంలోని మంగమూరు సెంటర్లో గల ఒక బేకరిలో పనిచేస్తున్నాడు. బేకరిలోని ఒక గదిలోనే ఉంటాడు. సోమవారం రాత్రి పని చేసిన బాబు అదేరోజు రాత్రి గదిలో ఫ్యాన్‌కు ఉరి వేసుకొని మరణించాడు. ఆత్మహత్యకు కారణాలు తెలియలేదు. తాలుకా పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఫ్లైఓవర్ బ్రిడ్జి మీద శవం...

నగరంలోని సౌత్ బైపాస్ హైవే ఫ్లైఓవర్ బ్రిడ్జి మీద ఒక గుర్తు తెలియని శవాన్ని హైవే పోలీసులు గుర్తించారు. మంగళవారం తెలవారుజామున 7 గంటల సమయంలో మృతదేహం బ్రిడ్జి మీద పడినట్లు భావిస్తున్నారు. ఏదైనా గుర్తు తెలియని వాహనం ఢీ కొడితే మరణించాడో, లేక ఏదైనా వాహనం నుంచి జారి పడి మరణించాడో స్పష్టంగా తెలియడం లేదు. మృతదేహాన్ని జీజీహెచ్‌కు తరలించిన పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

అరటి రైతుల ఆర్తనాదం

ఓ వైపు వర్షాలు మరో వైపు పంటకు గిట్టుబాటు ధరలు లేకపోవడంతో అరటి రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈదురుగాలుల ధాటికి అరటి తోటలు ఎక్కడ నేలకొరిగిపోతాయోనని ఆందోళన చెందుతున్న రైతులను.. పతనమైన ధరలు మరింత భయపెడుతున్నాయి. లక్షలాది రూపాయలు పెట్టుబడి పెట్టి ఏడాదిపాటు శ్రమించి అరటి సాగు చేస్తే తీరా పంట చేతికొచ్చేసరికి మార్కెట్‌లో ధర లేకపోవడంతో రైతులకు కంటి మీద కునుకు కరువైంది. వినాయక చవితి వరకు రూ.300కు పైగా పలికిన అరటి గెల ధర ప్రస్తుతం రూ.100కు అమ్ముడుపోవడం లేదని రైతులు గగ్గోలు పెడుతున్నారు.

- ● వినాయకచవితి తర్వాత పూర్తిగా పతనమైన అరటి గెలల ధరలు
- ● గుంటూరు మార్కెట్‌లో ధరలు లేక ఇతర రాష్ట్రాలకు తరలిస్తున్న వైనం
- ● అక్కడా అదే పరిస్థితి ఎదురవటంతో లబోదిబోమంటున్న రైతన్నలు
- ● పండగకు ముందు రూ.300 ధర పలికిన గెల ప్రస్తుతం రూ.100
- ● ఆరుగాలం శ్రమించినా ఆదాయం లేక అప్పులపాలవుతున్నామని ఆవేదన



కంభం చెరువు కిందసాగుచేస్తున్న అరటి తోటలు

కంభం:

జిల్లాలో సుమారు 1500 ఎకరాల్లో అరటి సాగు చేశారు. చారిత్రాత్మక కంభం చెరువు ఆయకట్టు కింద రైతులు ఎక్కువగా అరటి సాగు చేస్తారు. చెరువులో కొద్ది పాటి నీరు ఉండటంతో పంటల సాగుకు విడుదల చేయకపోయినా కేవలం బోర్ల మీద ఆధారపడి ఈ ప్రాంత రైతులు అరటి సాగు చేశారు. కంభంతోపాటు గిద్దలూరు, బేస్తవారిపేట, దోర్నాల, యరగొండపాలెం, రాచర్ల, కొమరోలు, త్రిపురాంతకం మండలాల్లో రైతులు అధికంగా అరటి సాగు చేస్తుంటారు. మొదటిసారి అరటి సాగు చేసిన రైతులు ఎకరాకు సుమారు లక్షన్నర రూపాయల వరకు పెట్టుబడి పెట్టారు. రెండోసారి తోట కొనసాగించిన వారు రూ.లక్ష వరకు, కౌలు రైతులు అంతకంటే ఎక్కువ మొత్తంలో పెట్టుబడి కోసం ఖర్చు చేశారు.

వినాయక చవితి తర్వాత ధరలు పతనం

రైతులు ఎక్కువగా అరటిని గుంటూరు మార్కెట్‌ కు తరలిస్తుంటారు. వినాయక చవితి పండగకు ముందు గుంటూరులో గెల సైజును బట్టి రూ. 300కు పైగా ధర లికింది. పండుగ ముగిసిన అనంతరం రోజు రోజుకు ధరలు పడిపోయాయి. ప్రస్తుతం గెల సైజును బట్టి రూ.100 నుంచి రూ.150 లోపు పలుకుతోందని, కొన్ని సార్లు వందకన్నా తక్కువ ధర ఇస్తున్నారని రైతులు వాపోతున్నారు. గుంటూరుకు ఆటోకైతే రూ.6 వేలు, మినీ లారీకి రూ.12 వేలు బాడుగ ఖర్చవుతుందని రైతులు, కనీసం ఆ డబ్బులు కూడా చేతికొచ్చే పరిస్థితి ఉండటం లేదని చెబుతున్నారు. ఇటీవల కాలంలో గుంటూరులో మార్కెట్ లేకపోవడంతో ఇతర రాష్ట్రాలకు ట్రాన్స్‌పోర్ట్ చేస్తున్నామని, అక్కడ కూడా ఆశించిన ధర దక్కడం లేదని రైతులు గగ్గోలు పెడుతున్నారు.



కోతకు సిద్ధంగా ఉన్న అరటి గెలలు



మార్కెట్‌కు తరలించేందుకు ఆటోలో ఎక్కిస్తున్న గెలలు

లోకల్ మార్కెట్‌లోనూ అదే తీరు

స్థానికంగా కొందరు దళారులు బట్టీలు ఏర్పాటు చేసుకొని కమిషన్ వ్యాపారం చేస్తుంటారు. దూర ప్రాంతాలకు వెళ్లలేని రైతులు స్థానికంగా ఉండే కమీషన్ కొట్లకు అరటి గెలలను తీసుకెళ్తారు. ఒకరోజు బట్టీలో ఉంచిన అనంతరం మరుసటి రోజు తెల్లవారు జామున ఆ గెలలకు వేలం నిర్వహిస్తారు. వేలం అనంతరం వారి కమీషన్, బట్టీ కూలీ, ఆటో కూలీ తీసుకొని మిగిలిన డబ్బులు రైతులకు చెల్లిస్తారు. ఇతర ప్రాంతాల నుంచి కూడా ఇక్కడికి అరటి గెలలు వస్తుండటంతో ధరలు పూర్తిగా పడిపోయాయి. పెద్ద సైజు గెలలు కూడా వంద రూపాయలలోపే పలుకుతున్నాయి.

రైతులకు ఆసరా కరువు

లక్షలాది రూపాయలు పెట్టుబడులు పెట్టి సాగు చేసుకున్న అరటి తోటలు గడిచిన ఏడాదిన్నర వ్యవధిలో పెనుగాలుల ధాటికి నేలకొరిగిపోయి రైతులు నష్టపోయారు. పంట నష్టం వివరాలను ఉద్యానవన శాఖాధికారులు నమోదు చేసుకుని వెళ్లారేగానీ పరిహారం ఇవ్వలేదని రైతులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పంట నష్టపోయిన రైతులను ఆదుకోవడంతో అరటికి మద్దతు ధర దక్కేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

పెట్టుబడి చేతికొచ్చేలా లేదు



పొలం కౌలుకు తీసుకొని అరటి సాగు చేస్తున్నా. ఎకరాకు లక్ష రూపాయలకు పైగా పెట్టుబడి ఖర్చవుతోంది. చెరువులో నీరు అందకపోయినా బోర్ల కింద అరటి తోటలు సాగు చేసుకున్నాం. గెలలు కోసి మార్కెట్‌కు తరలించాలంటే ఖర్చులు పెరిగిపోయాయి. ప్రస్తుతం ఉన్న రేట్లను బట్టి చూస్తే పెట్టుబడులు కూడా వచ్చే పరిస్థితి లేదు.

– చాంద్, రైతు, కంభం

చవితి తర్వాత ధర పడిపోయింది



నాలుగు ఎకరాల్లో అరటి తోట వేశా. వినాయక చవితి పండగకు ముందు కోతకు వచ్చిన గెలలు మార్కెట్‌లో కొంత ధర పలికాయి. పండగ అనంతరం ధరలు అమాంతం పడిపోయాయి. తోటల్లోనే కాయలు మాగిపోతున్నాయి. లక్షలాది రూపాయలు పెట్టుబడి పెట్టి సాగు చేసిన పంటలకు గిట్టుబాటు ధరలేక నష్టపోవాల్సి వస్తోంది.

– వహీద్, రైతు, కంభం

అరటి రైతులకు మద్దతు ధర కల్పించాలి



పశ్చిమ ప్రకాశంలో ఎక్కువ మంది వ్యవసాయం మీదనే ఆధారపడి జీవిస్తుంటారు. రైతులు ఆరుగాలం శ్రమించి పండించుకున్న పంటలకు గిట్టుబాటు ధరలు లేకపోతే వారు తీవ్రంగా నష్టపోతారు. అరటి రైతులకు గిట్టుబాటు ధరలు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. పంటనష్టపోయిన రైతులను ఆదుకోవాలి.

– నెమలిదిన్నె చెన్నారెడ్డి, కంభం ఏఎంసీ మాజీ చైర్మన్

దళితుల భూఆక్రమణకు తెగబడిన టీడీపీ నేతలు

- ● అర్ధరాత్రి పంటను ధ్వంసం చేసి, కబ్జాకు యత్నం
- ● అడ్డుకునేందుకు వెళ్లిన దళితులపై ఎదురు దాడి



పొలం వద్ద ఇరువర్గాలతో మాట్లాడుతున్న సీఐ సుబ్బారావు

మార్కాపురం టౌన్: కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక రాష్ట్రంలో రోజురోజుకూ అరాచకాలు పెరిగిపోతున్నాయి. టీడీపీ నేతలు భూఆక్రమణలకు యథేచ్ఛగా తెగబడుతున్నారు. అడ్డొచ్చిన వారిపై దాడులు చేస్తున్నారు. దళితులు సాగుచేసుకుంటున్న భూమిని టీడీపీ నేత ఆక్రమించుకునేందుకు పైరును ధ్వంసం చేస్తుండగా అడ్డుకునేందుకు వెళ్లిన దళితులపై ఎదురు దాడి చేసిన ఘటన ప్రకాశం జిల్లా మార్కాపురంలో సోమవారం రాత్రి జరిగింది. బాధితుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన దళిత సంఘ నేత ఐజక్ రెండు ఎకరాల్లో సాగు చేసిన కంది పంటను పట్టణానికి చెందిన టీడీపీ నేత వక్కలగడ్డ మల్లికార్జున్ అనుచరులు సోమవారం రాత్రి ధ్వంసం చేసేందుకు యత్నించారు. సమాచారం అందుకున్న ఐజక్ అతని బంధువులు పంట వద్దకు చేరుకుని వారిని అడ్డుకుంటుండగా తమపై మల్లికార్జున్ అనుచరులు దాడిచేశారని బాధితులు వాపోయారు. ఈ ఘటనపై ఎస్పీకి, స్థానిక పోలీసు అధికారులకు ఫోన్‌లో ఫిర్యాదు చేసి, ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని బాధితులు కోరారు. మంగళవారం ఉదయం ఇరువర్గాలు పొలం వద్దకు చేరుకోవటంతో ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది. దీంతో మార్కాపురం సీఐ సుబ్బారావు సిబ్బందితో అక్కడికి వెళ్లి పరిస్థితి అదుపు చేశారు.

దొంగ రిజిస్ట్రేషన్లు చేయించుకున్నారు



1922లో 9 మంది దళితులకు అప్పటి బ్రిటిష్ ప్రభుత్వం తర్లుపాడు రోడ్డులో 41.58 ఎకరాల భూమిని ఇచ్చింది. మా పూర్వీకుల నుంచి ఆ పొలం మా అనుభవంలోనే ఉంది. అయితే 1994లో దొంగ రిజిస్ట్రేషన్‌లు చేయించుకుని రియల్ ఎస్టేట్ వ్యాపారి వక్కలగడ్డ మల్లికార్జున్, మురళీకృష్ణ, పెరుమాళ్ళ శ్రీనివాసరావు, ప్రకాష్ తదితరులు అప్పటి నుంచి మమ్మల్ని ఇబ్బంది పెడుతున్నారు. ఈ విషయాన్ని అనేక సార్లు రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్లాను. రాజకీయ పలుకుబడితో అధికారులపై ఒత్తిడి తెచ్చి మాకు అన్యాయం చేస్తున్నారు.

– చేబ్రోలు ఐజక్

ఆ పొలాన్నే నమ్ముకుని బతుకుతున్నాం



కొన్నేళ్లుగా ఆ పొలాన్నే నమ్ముకుని 9 మంది కుటుంబాలు బతుకుతున్నాయి. మా పొలాన్ని రాత్రికి రాత్రి ఆక్రమించుకునేందుకు టీడీపీ నేత ప్రయత్నించాడు. పంటను ధ్వంసం చేశాడు. అడ్డుకునేందుకు వెళ్లిన నాపై కర్రలతో దాడి చేయటంతో స్పృహ కోల్పోయాను. ప్రస్తుతం వైద్యశాలలో చికిత్స పొందుతున్నాను. మా పొలాన్ని మాకు ఇప్పించండి.

– కృష్ణవేణి

దాడి కేసులో ఇద్దరు అరెస్టు

మార్కాపురం: ఇంటి స్థలాన్ని ఆక్రమించగా ప్రశ్నించిన మహిళపై దాడి చేసిన ఇద్దరిని అరెస్టు చేసినట్లు ఎస్సై సైదుబాబు తెలిపారు. పట్టణంలోని బాపూజీ కాలనీలో గోపాలుని లక్ష్మీభవానీ ఇంటి స్థలాన్ని షేక్ అబ్దుల్ రహమాన్, కందుకూరి శంకరాచారి ఆక్రమించారు. దీనిపై భవానీ వారిని ప్రశ్నించగా వారు ఆమెపై దాడి చేసి గాయపరిచారు. దీనిపై బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఇద్దరిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచగా జడ్జి రిమాండ్ విధించినట్లు పేర్కొన్నారు. నిందుతులు ఇద్దరిని సబ్‌జైల్‌కు తరలించినట్లు పట్టణ ఎస్సై సైదుబాబు చెప్పారు.

ఒంగోలు వాసి సికింద్రాబాద్‌లో మృతి



రోడ్డు ప్రమాదంలో చనిపోయిన మేస్త్రీ శ్రీను

ఒంగోలు టౌన్: ఒంగోలు పరిసర ప్రాంతాలకు చెందిన శ్రీను అనే భవన నిర్మాణ కార్మికుడు సికింద్రాబాద్ గాంధీ హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తుర్కపల్లి పోలీసులు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. భవన నిర్మాణ పనుల నిమిత్తం ఒంగోలు నుంచి భువనగిరి వచ్చిన శ్రీను అక్కడ నుంచి తుర్కపల్లి మండలం రామోజీ నాయక్ తండాకు వెళ్తున్న క్రమంలో పెద్ద తండా గ్రామ శివారు వద్ద రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. తీవ్రంగా గాయపడిన అతడిని వెంటనే సికింద్రాబాద్ గాంధీ ఆసుపత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శ్రీను మరణించాడు. మృతుడి పూర్తి వివరాలు తెలియవు. మెడ మీద అమ్మ అని, కుడి చేతిమీద లవ్ సింబల్, స్టార్ పచ్చబొట్లు ఉన్నాయి. మృతుడి ఆచూకీ తెలిసినవారు 8712662479, 8712662805ను సంప్రదించాలని తుర్కపల్లి పోలీసులు కోరారు.

సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌పై ఉక్కుపాదం

● రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి చైర్మన్, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి కృష్ణయ్య



మాట్లాడుతున్న కాలుష్య నియంత్రణ మండలి చైర్మన్ కృష్ణయ్య

ఒంగోలు సబర్బన్: సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగంపై ఉక్కుపాదం మోపాలని రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి చైర్మన్, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి పి.కృష్ణయ్య అన్నారు. మంగళవారం ఒంగోలు వచ్చిన ఆయన కాలుష్య నియంత్రణ కోసం తీసుకోవాల్సిన చర్యలపై సంబంధిత శాఖల ఉన్నతాధికారులతో ప్రకాశం భవనంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. కలెక్టర్ పి.రాజాబాబు అధ్యక్షతన జరిగిన సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ, ఇతర అధికారులతో వివిధ అంశాలపై కృష్ణయ్య చర్చించారు. ఈ సందర్భంగా కృష్ణయ్య మాట్లాడుతూ సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను వినియోగాన్ని నివారించి, మరోవైపు ఇప్పటికే ఉన్న వ్యర్థాలను రీసైకిల్, రీయూజ్ చేయటం ద్వారా సర్క్యులర్ ఎకానమీ పెంచేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పరిశ్రమల ఏర్పాటు ద్వారా ఉపాధి అవకాశాలు పెంచాలన్నది ప్రభుత్వ లక్ష్యమన్నారు. అదే సమయంలో కాలుష్యాన్ని కూడా తగ్గించడంపై దృష్టి సారించాల్సిన అవసరం సంబంధిత శాఖలపై ఉందన్నారు. ఇప్పటికే గ్రానైట్స్‌తో పాటు మత్స్య, వ్యవసాయ-దాని అనుబంధ రంగాలలో అవలంబిస్తున్న విధానాల ద్వారా వస్తున్న వ్యర్థాల వల్ల పర్యావరణం కాలుష్యం అవుతున్న తీరుపై ఆయన చర్చించారు. ఆయా రంగాల ద్వారా వస్తున్న వ్యర్థాలను రీయూజ్ చేయడంపై దృష్టి పెట్టాలని అధికారులకు సూచించారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వల్ల కలిగే ఆరోగ్యపరమైన, పర్యావరణ సంబంధ సమస్యలపై అవగాహన కల్పించాలన్నారు. బయోడీగ్రేడబుల్ సంచులను ప్రోత్సహించడం ద్వారా పర్యావరణాన్ని కాపాడుకోవచ్చన్నారు. పరిశ్రమలతో పాటు రైల్వేస్టేషన్లు, బస్సు స్టేషన్ల పరిసరాలు శుభ్రంగా నిర్వహించడంపై దృష్టి పెట్టాలన్నారు.

కలెక్టర్ పి.రాజాబాబు మాట్లాడుతూ సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగ నివారణ, వివిధ రంగాల ద్వారా వచ్చే కాలుష్యాన్ని నివారించేందుకు సంబంధిత సమన్వయంతో అమలు చేసేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. డీపీఓ వెంకటేశ్వరరావు, గనుల శాఖ డిప్యూటీ డైరెక్టర్ రాజశేఖర్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ రాఘవరెడ్డి, జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ శ్రీనివాసరావు, ఒంగోలు ఆర్డీఓ కళావతి, జిల్లా వ్యవసాయ అధికారి రజనీ కుమారి, డీఎస్ఓ పద్మశ్రీ, ఏపీఎంఐపీ పీడీ శ్రీనివాసులు, జిల్లా హార్టికల్చర్ ఆఫీసర్ గోపీచంద్, దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ పానకాలరావు, అన్ని మున్సిపాలిటీలు, అటవీ, రవాణాశాఖల అధికారులు పాల్గొన్నారు.

ట్రేడింగ్ యాప్ పేరుతో ఘరానా మోసం

- ● ఫేస్‌బుక్, వాట్సప్ గ్రూప్‌లో మహిళ చాటింగ్
- ● ట్రేడింగ్ పేరుతో రూ.1.16 కోట్లు దండుకుని మోసం చేసిన వైనం
- ● కనిగిరిలో ఆలస్యంగా వెలుగులోకి ఘటన

కనిగిరిరూరల్: రోజుకో కొత్త సైబర్ మోసం వెలుగులోకి వస్తోంది. ఇటీవల కనిగిరి పట్టణానికి ఓ ఉపాధ్యాయుడు డిజిటల్ మోసానికి గురై రూ.32 లక్షలు పోగొట్టుకున్నాడు. ఈ ఘటన మరవక ముందే కొత్తగా పట్టణానికి చెందిన ఓ షోరూం వ్యాపారి ట్రేడింగ్ యాప్ మోసానికి గురై రూ.1.16 కోట్లు మోసపోయాడు. బాధితుడు పరువు పోతుందని భావించి గుట్టుచప్పుడు కాకుండా పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈమేరకు మంగళవారం రాత్రి సీఐ ఎస్‌కే ఖాజావలి విలేకరులకు వివరాలు వెల్లడించారు. ట్రేడింగ్ యాప్ పేరుతో ఫేస్‌బుక్, వాట్సప్‌ల ద్వారా పరిచయం చేసుకుని, ముందుగా మంచి ప్రాపర్టీలు చూపించి ఆశ పెట్టి.. యాప్‌లో డబ్బులు పెట్టించి, చాటింగ్ చేస్తూ.. మోసం చేస్తున్నట్లు తెలిపారు. ఈ తరహా పద్ధతిలో పట్టణానికి చెందిన ఓ వ్యాపారికి మోసపోయినట్లు చెప్పారు. ఫేస్‌బుక్‌లో ట్రేడింగ్ యాప్‌లో ఓ మహిళ పరిచయమై, ఆ తర్వాత వాట్సప్ గ్రూప్ పెట్టి ట్రేడింగ్ చేస్తూ రూ.1.16 కోట్లు మోసం చేసినట్లు వెల్లడించారు. బాధితుడు ఇటీవల తమకు ఫిర్యాదు చేశారన్నారు. సైబర్ మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

భూగర్భ జలమట్టం పెరిగేలా చర్యలు

● కలెక్టర్ రాజాబాబు




పవర్‌పాయింట్ ప్రజెంటేషన్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్

ఒంగోలు సబర్బన్: జిల్లాలో భూగర్భ జల మట్టం మరింత పెరిగేలా గ్రామస్థాయిలో వాటర్ మేనేజ్‌మెంట్ ప్రణాళిక సిద్ధం చేయాలని కలెక్టర్ పి. రాజాబాబు అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో మంగళవారం భూగర్భ, జల వనరుల శాఖ, డ్వామా, మైక్రో ఇరిగేషన్, వ్యవసాయ, ఉద్యాన శాఖ, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మట్లాడుతూ గ్రామాల వారీగా వాటర్ డిమాండ్ యాక్షన్ ప్లాన్ రూపొందించాలన్నారు. జిల్లాలో గ్రామస్థాయిలో వాటర్ మేనేజ్‌మెంట్ ప్రణాళికల రూపకల్పనపై సమీక్షించి తగు సూచనలు చేశారు. జిల్లాలోని 799 ఇరిగేషన్ ట్యాంకులు, సంబంధిత ఫీడర్ ఛానెల్స్‌లో ఉపాధి హామీ పథకం నిధులను అనుసంధానిస్తూ పూడికతీత పనులు చేయాల్సిన అవసరం ఉందన్నారు. అందుకు అనుగుణంగా నివేదిక రూపొందించాలని ఇరిగేషన్, డ్వామా అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా వాటర్ మేనేజ్‌మెంట్‌పై సంబంధిత శాఖల అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. సమావేశంలో జల వనరుల శాఖ, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈలు వరలక్ష్మి, బాల శంకరరావు, జిల్లా పరిషత్ సీఈఓ చిరంజీవి, గ్రౌండ్‌వాటర్ శాఖ డీడీ వందనం, జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వరరావు, ఉద్యాన శాఖాధికారి గోపీచంద్, ఏపీఎంఐపీ పీపీ శ్రీనివాసరావు, డ్వామా, వ్యవసాయ శాఖ అధికారులు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

మార్కెట్ స్థలాన్ని ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించొద్దు

● వామపక్ష నేతలు డిమాండ్



ధర్నాలో పాల్గొన్న నేతలు

ఒంగోలు టౌన్:

నగర నడిబొడ్డున ఉన్న కోట్లాది రూపాయల విలువైన పాత మార్కెట్ స్థలాన్ని ప్రైవేటు వ్యక్తులకు అప్పగించాలన్న ఆలోచన విరమించుకోవాలని వామపక్ష నేతలు డిమాండ్ చేశారు. సీపీఎం ఆధ్వర్యంలో మంగళవారం నగరపాలక సంస్థ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం నగర కార్యదర్శి చీకటి శ్రీనివాసరావు, సీపీఐ జిల్లా నాయకులు కొత్తకోట వెంకటేశ్వర్లు మాట్లాడుతూ వందల కోట్ల ప్రభుత్వ స్థలాన్ని ప్రైవేట్ వ్యక్తులకు లాభం చేకూర్చేందుకు వదిలిపెట్టడం పాలకులు ప్రజా ప్రయోజనాలకు తిలోదకాలు ఇచ్చినట్లేనని ఆరోపించారు. గత 15 ఏళ్లుగా ఖాళీగా ఉన్న ఈ స్థలాన్ని ఎలాంటి చర్చ లేకుండా కౌన్సిల్‌లో తీర్మానం చేయడం, కేవలం 5 రోజుల్లోనే టెండర్లు పిలవడంపై అనుమానాలు వ్యక్తం చేశారు. దీని వెనుక ఏయో శక్తులు ఉన్నాయో బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. ప్రజల ఆస్తులను పరిరక్షించాల్సిన నగరపాలక సంస్థే వాటిని వాటిని ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టడం దారుణమని విమర్శించారు. నగరపాలక సంస్థ స్వయంగా షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించాలని , ఆ భవనాన్ని చిరువ్యాపారులకు అద్దెకిచ్చి స్థిరమైన ఆదాయం పొందవచ్చని సూచించారు. ప్రభుత్వం వద్ద నిధులు లేకపోతే బ్యాంకులు, ఇన్సూరెన్స్ సంస్థల నుంచి రుణాలు తీసుకొని నిర్మాణాలు చేయాలే తప్ప నిధులు లేవన్న సాకుతో బాధ్యతల నుంచి తప్పుకోవడం ప్రభుత్వ అసమర్థతకు నిదర్శనమవుతుందన్నారు. ప్రైవేట్ వ్యక్తులకు 33 సంవత్సరాల లీజుకు ఇవ్వడం వల్ల ప్రభుత్వ ఖజానాకు గండిపడుతుందని చెప్పారు. ఒకవైపు ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరణ చేస్తున్న పాలకులు మరో వైపు ప్రజా ఆస్తులను ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టడం చేయడాన్ని ప్రజలు తిరస్కరించాలని పిలుపునిచ్చారు. నిరసనలో సీపీఎం నగర నాయకులు సయ్యద్ హుసేన్, టి.మహేష్, తంబి శ్రీనివాసరావు, జి.రమేష్, మారెళ్ల సుబ్బారావు, భక్త్ సింగ్ రాజు, సిపిఐ నాయకులు శ్రీరాం శ్రీనివాసరావు, కారుమూడి నాగేశ్వరరావు, నూనె మోహన్‌రావు, సిద్ధయ్య, కోనూరి వెంకటేశ్వర్లు, కల్లూరు లక్ష్మయ్య, మన్నం హనుమంతరావు, ఏవై రెడ్డి పాల్గొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

Education

■ డైరెక్ట్ 10th, Inter (వయసు 18) డిగ్రీ (All), PG (All) అడ్మిషన్ గైడెన్స్, డిప్లొమో, B.Tech, M.Tech,DBM, ఫార్మసీ, M.Phill, Phd, BAMS, BHMS. ✆ 8143100455, 7396995332 [G-286]

COMPUTER EDUCATION

■ నిరుద్యోగ M/Fలకు Govt. ద్వారా ఉచితంగా కంప్యూటర్, TALLY, స్పోకెన్ ఇంగ్లీష్, M.S.ఆఫీస్ కోర్సులు నేర్పించి జాబ్ కల్పించబడును. ఫ్రీ హాస్టల్, ఫ్రీ మీల్స్ మరియు స్టైఫండ్ కలదు. సంప్రదించండి. సెల్: 94934 49782. [SCA25008751]

Services

GOLD FINANCE

■ MVS Gold బ్యాంకులలో ఇతర ప్రైవేట్ సంస్థలో తాకట్టులో ఉన్న మీ బంగారాన్ని మీరున్న ప్రాంతంలో మీ దగ్గరకే వచ్చి విడిపించి కొనబడును. 8143299166, 9281458813. [NA-11396]

■ బంగారం బ్యాంకులలో / ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) ఫోన్ : 81422 92071 [G-791]

వివరాలకు సంప్రదించండి :
క్లాసిఫైడ్స్ :
ఒంగోలు
90102 02762

Wanted

■ ఒంగోలు మంగమూరు రోడ్డులోని నారాయణ పబ్లిక్ స్కూల్ నందు పనిచేయుటకు ప్రైమరీ టీచర్స్ మరియు Unmarried Male వార్డెన్స్ కావలెను. సంప్ర।। 9704383262. [OA-492]

■ వాగ్దేశ్య ఇంటీరియర్స్ నందు జాబ్ చేయుటకు మార్కెటింగ్ టీమ్ అనుభవం గలవారు అర్జంటుగా కావలెను. అర్హత: డిగ్రీ. సంప్ర।। 7599999729 [SCA25008648]

■ Secure Security Services టంగుటూరు పరిసర ప్రాంతాలలో పని చేయుటకు సెక్యూరిటీ SO లు మరియు ASOలు, సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. 99595 98279 [NA-24446]

■ ఒంగోలు వల్లూరమ్మ గుడివద్ద Eng కాలేజీకి 3 సం Exp సె.గార్డ్స్ కావలె ను. డ్యూ 12 గం, జీ 13400, PF, ESI రూమ్ భోజనం ఫ్రీ ✆ 8331876264 [SCA25008711]

■ Wanted a Marketing Executive to Work for Jr College in VJA. Salary + incentive 8297225577, 9676862477 [HA-16364]

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.